
సాక్షి
శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు

ఆదివారం । 15 । జూన్ । 2025



సోమశిలలో 38.355 టీఎంసీలు

సోమశిల: జలాశయంలో శనివారం 38.355 టీఎంసీల నీరుంది. పెన్నార్ డెల్టాకు 3,880, ఉత్తర, దక్షిణ కాలువలకు 725 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10 గ్రా)	రూ.1,02,910
22 క్యారెట్ల ఆర్నమెంట్ (గ్రా)	రూ.9,320
3 శాతం జీఎస్టీతో	రూ.9,600
నవర (8 గ్రా)	రూ.76,800

గరిష్టం/కనిష్టం
38.5 /28.6

వాతావరణం

జిల్లాలో ఉష్ణోగ్రతలు ఆదివారం సాధారణం గానే ఉంటాయని వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. గాలిలో తేమ శనివారం 67 శాతంగా నమోదైంది.

నీట్‌లో మనోళ్లు సత్తా చాటారు

నెల్లూరు (టౌన్): ఎంబీబీఎస్, బీడీఎస్ కోర్సుల్లో ప్రవేశం కోసం నిర్వహించిన నీట్ ఫలితాల్లో జిల్లా విద్యార్థులు సత్తా చాటారు. గత నెల 4వ తేదీన నీట్‌ను ఎన్‌టీఏ ఆధ్వర్యంలో నిర్వహించారు. జిల్లాలో మొత్తం 10 కేంద్రాల్లో పరీక్ష జరిగింది. జిల్లా వ్యాప్తంగా 2,913 మంది హాజరయ్యారు. ఈ ఫలితాల్లో జిల్లాకు చెందిన పలువురు విద్యార్థులు జాతీయస్థాయిలో ర్యాంకులు సాధించారు. ఎస్‌ఇ.కవిన్ 161వ ర్యాంకు, శ్రీరామ్ 253, యోగేష్ కార్తీక్ 323, వెంకట శ్రీనివాస్ 515, వైష్ణవ్‌కుమార్ 546, లలిత్ శ్రీహాస్ 563, సుభాష్ శంకర్ 804, విశ్వక్ 955, కత్రివేల్ 962 ర్యాంకులు సాధించారు. అదే విధంగా జాహ్నవి 588 మార్కులు భానుశ్రీసులోచన 543, హరిణి 542, చేతన్ 531 మార్కులు సాధించారు.

వైద్య సేవే లక్ష్యం



స్థానిక హరనాథపురంలో లలిత్‌శ్రీహాస్ నివాసం ఉంటున్నారు. తండ్రి రాజశేఖర్, తల్లి శ్రీలక్ష్మి ఉపాధ్యాయులుగా పనిచేస్తున్నారు. మెడిసిన్ చదివి ప్రజలకు వైద్య సేవలు అందించడమే లక్ష్యమని లలిత్‌శ్రీహాస్ చెబుతున్నారు.

– లలిత్ శ్రీహాస్ (563 ర్యాంకు)

రేడియాలజీ చేస్తా



స్థానిక ఉస్మాన్‌సాహెబ్‌పేటలో విశ్వక్ నివాసం ఉంటున్నారు. తండ్రి వంశీకృష్ణ, తల్లి లావణ్య ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్యులుగా పనిచేస్తున్నారు. ఉత్తమ మెడికల్ కళాశాలలో సీటు సాధించి రేడియాలజిస్టుగా పనిచేయడమే లక్ష్యంగా విశ్వక్ చెబుతున్నారు.

– ఎం.విశ్వక్ (955 ర్యాంకు)

న్యూరాలజిస్టునవుతా



స్థానిక భక్తవత్సలనగర్‌లో జాహ్నవి నివాసం ఉంటున్నారు. తండ్రి రవి కుమార్, తల్లి శ్రీలక్ష్మి. మంచి మెడికల్ కళాశాలలో పీజీ చేసి న్యూరాలజిస్టుగా పనిచేయాలన్నదే లక్ష్యంగా జాహ్నవి చెబుతోంది.

– జాహ్నవి (2505 ర్యాంకు)

గైనకాలజీ చదువుతా



సంగంలో భానుశ్రీసులోచన నివాసం ఉంటున్నారు. తండ్రి మోహనరావు ఉపాధ్యాయులుగా పనిచేస్తున్నారు. తల్లి సులోచన గృహిణి. మెడిసిన్ పూర్తి చేసి గైనకాలజిస్టుగా పని చేయాలన్నదే లక్ష్యమని ఆమె చెబుతున్నారు.

– భానుశ్రీ సులోచన

ఆంకాలజిస్టునవుతా



నగరంలోని పద్మావతి సెంటరులో హరిణి నివాసం ఉంటున్నారు. తండ్రి శివకుమార్ విద్యుత్తుశాఖలో అసిస్టెంట్ మేనేజర్. తల్లి పుష్పలత గృహిణి. హరిణి మెడిసిన్ పూర్తి చేసి భవిష్యత్తులో ఆంకాలజిస్టుగా పని చేయాలన్నదే లక్ష్యమని చెబుతోంది.

– హరిణి



రిమాండ్ నిమిత్తం జిల్లా కేంద్ర కారాగారంలో ఉన్న మాజీమంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డిని ములాఖత్‌లో శనివారం పరామర్శించి వస్తున్న మాజీ మంత్రి, పుంగనూరు ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎమ్మెల్సీ చంద్రశేఖర్‌రెడ్డి, అనంతపురం జిల్లాకు చెందిన మాజీ ఎమ్మెల్యేలు అనంత వెంకట్రామిరెడ్డి, కేతిరెడ్డి వెంకట్రామిరెడ్డి తదితరులు

క్లుప్తంగా

పోలీసుల అదుపులో ఐదుగురు?

- స్టేషన్‌లో భద్రపరిచిన రూ.3.05 కోట్ల నగదు
- వివరాలు గోప్యంగా ఉంచుతున్న పోలీసులు

మర్రిపాడు: మండలంలోని బాట సమీపంలో అనుమానాస్పద రీతిలో గుర్తించిన కారుకు సంబంధించిన కేసులో ఐదుగురు అనుమానితులు పోలీసుల అదుపులో ఉన్నట్లు సమాచారం. ఆత్మకూరు డీఎస్పీ వేణుగోపాల్ నేతృత్వంలో ముగ్గురు సీఐలు, ఐదుగురు ఎస్సైలు ఈ కేసు విషయమై పరిశీలన చేస్తున్నారు. ఈ కేసుకు సంబంధించి రూ.3.05 కోట్ల నగదును స్వాధీనం చేసుకుని, పోలీస్‌స్టేషన్‌లో భద్రపరిచారు. అయితే ఇప్పటి వరకు వెల్లడైన సమాచారంపై పోలీసులు ధ్రువీకరించకపోవడం గమనార్హం. అసలు కారులోనే నగదు దొరికిన విషయాలను పోలీసులు గోప్యంగా ఉంచారు. అనుమానితుల నుంచి మొత్తం నగదు రాబట్టారా, అసలైన వారు దొరికారా అనే విషయాలు తెలియాల్సి ఉంది. ఈ కేసుకు సంబంధించి స్టేషన్ వద్ద పదుల సంఖ్యలో వాహనాలు చూసిన మండల వాసులు ఏం జరుగుతుందోనన్న ఉత్సుకతతో ఉన్నారు.

కత్తితో దాడి ఘటనలో నిందితుడి అరెస్ట్



నెల్లూరు(క్రైమ్): కత్తితో దాడి చేసిన ఘటనలో నిందితుడిని పోలీసులు అరెస్ట్ చేశారు. పోలీసుల సమాచారం మేరకు.. నగరానికి చెందిన కృష్ణ మూలాపేట రావిచెట్టు సెంటర్‌లో బైక్ మెకానిక్ షాపు నిర్వహిస్తున్నారు. ఇరుగోళ్లమ్మ సంఘానికి చెందిన వేణు ఈనెల 12వ తేదీ బైక్ రిపేర్ చేయించుకునేందుకు అక్కడికి వచ్చారు. వస్తువులు తెచ్చుకోమని కృష్ణ సూచించగా అతనితో గొడవ పడ్డాడు. షాపులో ఉన్న కృష్ణ బావమరిది వెంకటేష్, మరో వ్యక్తి వేణుని అడ్డుకోవడంతో అక్కడి నుంచి వెళ్లిపోయారు. కొద్దిసేపటి తర్వాత వేణు అక్కడికి వచ్చి కత్తితో కృష్ణపై దాడిచేయబోగా వెంకటేష్ అడ్డుకోవడంతో అతనిపై దాడిచేశాడు. బాధితుని ఫిర్యాదు మేరకు చిన్నబజారు పోలీసులు నిందితునిపై కేసు నమోదు చేశారు. ఎస్సై మాహబూబ్‌బాషా శనివారం నిందితుడిని అరెస్ట్ చేశారు.

మద్యం మత్తులో ట్రాక్టర్ డ్రైవర్ వీరంగం



ట్రాక్టర్ ఢీకొనడంతో దెబ్బతిన్న కారు



కారును ఢీకొన్న ట్రాక్టర్

మర్రిపాడు: మండలంలోని నెల్లూరు– ముంబై జాతీయ రహదారిపై కోనసముద్రం వద్ద శనివారం ఓ ట్రాక్టర్ డ్రైవర్ మద్యం మత్తులో వీరంగం సృష్టించాడు. ఓ కారును ఢీకొన్న ట్రాక్టర్ డ్రైవర్ అంతటితో ఆగకుండా ఏకంగా కారు డ్రైవర్‌పై దాడికి యత్నించాడు. దీంతో అటుగా వెళ్తున్న వాహనదారులు గుర్తించి అక్కడ ఆగడంతో ట్రాక్టర్ డ్రైవర్ పరారయ్యాడు. స్థానికుల సమాచారం మేరకు ఘటనా స్థలానికి చేరుకున్న హైవే మొబైల్ పోలీస్ సిబ్బంది పరారైన ట్రాక్టర్ డ్రైవర్‌ను అదుపులోకి తీసుకొని స్థానిక పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. మద్యం మత్తులో ఉన్న ట్రాక్టర్ డ్రైవర్ కాసేపు అక్కడ కూడా వీరంగం సృష్టించాడు.



ప్రత్యేకాలంకరణలో వెంగమాంబ దంపతులు

వెంగమాంబ బ్రహ్మోత్సవాలకు సర్వం సిద్ధం



విద్యుద్దీపాలంకరణలో వెంగమాంబ దేవస్థానం

- నిలుపుతో నేటి నుంచి ఉత్సవాలు ప్రారంభం

దుత్తలూరు: జిల్లాలో ప్రసిద్ధి చెందిన నర్రవాడ వెంగమాంబ పేరంటాలు బ్రహ్మోత్సవాలు ఆదివారం నిలుపు కార్యక్రమంతో ప్రారంభం కానున్నాయి. అందుకు తగ్గట్లు వ్యవస్థాపక ధర్మకర్తల మండలి, దేవదాయశాఖ అధికారులు తగిన ఏర్పాట్లు పూర్తి చేశారు. దేవస్థానం ఎదురుగా ఉన్న యాగశాలలో ఆదివారం ఉదయం హోమం నిర్వహించి బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ చేస్తారు. అనంతరం వెంగమాంబ, గురవయ్య దంపతులను ప్రత్యేకంగా అలంకరించి కుంకుమార్చన తదితర పూజలు నిర్వహిస్తారు. రాత్రికి అమ్మవారి పుట్టినిల్లు అయిన వడ్డిపాళెంలోని రేణుక ఎల్లమ్మ తల్లి ఆలయంలో పచ్చవ వంశస్తులు పసుపును దంచి లాంఛనంగా బ్రహ్మోత్సవాలకు శ్రీకారం చుడతారు. ఈ పసుపు దంచే కార్యక్రమానికి జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని తమ భక్తిని చాటుకుంటారు. దేవస్థానం వద్ద భక్తుల దర్శనం కోసం ప్రత్యేక క్యూలైన్లు ఏర్పాటు చేశారు.

నిందితుల వివరాలను వెల్లడిస్తున్న సంతపేట ఇన్‌స్పెక్టర్



గంజాయి విక్రేతల అరెస్ట్

- మూడు కేజీల గంజాయి, బైక్ స్వాధీనం

నెల్లూరు(క్రైమ్): చెడు వ్యసనాలకు బానిసలై ఒడిస్సా రాష్ట్రం నుంచి గంజాయిని తీసుకొచ్చి నెల్లూరు నగరంలో విక్రయాలకు పాల్పడుతోన్న ముగ్గురు నిందితులను పోలీసులు అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి మూడు కేజీల గంజాయి, యాక్టివా బైక్‌ను స్వాధీనం చేసకున్నారు. ఈ మేరకు సంతపేట పోలీస్‌స్టేషన్‌లో ఎస్సై జి.బాలకృష్ణతో కలిసి ఇన్‌స్పెక్టర్ జి.దశరథరామారావు శనివారం నిందితుల వివరాలను వెల్లడించారు. మూలాపేట కోనేటిమిట్ట ప్రాంతానికి చెందిన పి.రాజేష్ తన స్నేహితులైన చెన్నై అశోక్‌నగర్, జాఫర్‌ఖాన్‌పేటకు చెందిన ఎ.జేమ్స్, నెల్లూరు గుప్తాపార్కు సెంటర్‌కు చెందిన పి.వెంకట హరీష్ అలియాస్ హరీష్ ద్వారా గత కొంతకాలంగా ఒడిస్సా రాష్ట్రంలో గంజాయిని కేజీ రూ.2,300 చొప్పున కొనుగోలు చేసి నెల్లూరు నగరానికి తీసుకొచ్చేవారు. అనంతరం వాటిని చిన్న చిన్న ప్యాకెట్లుగా చేసి అధిక ధరలకు విక్రయించి సొమ్ము చేసుకోసాగారు. దీనిపై పోలీసులు గత కొంతకాలంగా తనిఖీలు ముమ్మరం చేశారు. అందులో భాగంగా శుక్రవారం నెల్లూరు ప్రధాన రైల్వేస్టేషన్ ద్విచక్ర వాహనాల పార్కింగ్ కేంద్రం సమీపంలో గంజాయి విక్రయించేందుకు సిద్ధంగా ఉన్న రాజేష్, జేమ్స్, హరీష్‌లను అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి మూడు కేజీల గంజాయి, యాక్టివా బైక్‌ను స్వాధీనం చేసుకున్నారు. నిందితులు చెడు వ్యసనాలకు బానిసై నగదు కోసం గంజాయి విక్రేతలుగా మారారని ఇన్‌స్పెక్టర్ తెలిపారు. నిందితులను అరెస్ట్ చేసిన సిబ్బంది శ్రీహరి, లావణ్యకుమార్ రాజా, అల్లాభక్షు, సురేంద్రబాబు, గోపి, కేవీ సుదర్శన్, తిరుపతి తదితరులను ఎస్పీ అభినందించారు.

భర్త చేతిలో భార్య హతం

- అనుమానం, వేధింపులే కారణం

నెల్లూరు(క్రైమ్): భార్య చీటికి మాటికి గొడవపడుతుండడంతో విసిగిపోయిన భర్త రోకలిబండతో దాడిచేసి హతమార్చాడు. ఈ ఘటన నెల్లూరులో శనివారం జరిగింది. పోలీసుల సమాచారం మేరకు.. బాలాజీనగర్ గొడహాస్టల్ సమీపంలో ఎల్.విజయ్‌చంద్ర, శైలజ(46) దంపతులు నివాసం ఉంటున్నారు. వారికి బీటెక్, పదో తరగతి చదువుతున్న ఇద్దరు కుమారులున్నారు. విజయ్‌చంద్ర ట్రెజరీ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్నారు. శైలజ తండ్రి చెన్నైలో ఉంటూ మృతిచెందారు. ఆయనకు చెందిన ఆస్తులు తమకు రావాలంటే కొంత నగదు ఖర్చు చేయాలని ఆమె భర్తకు చెప్పి అతనిచేత పెద్ద ఎత్తున నగదు ఖర్చు పెట్టించింది. దీంతో విజయ్‌చంద్ర అప్పులపాలయ్యారు. ఈ క్రమంలోనే భర్తపై ఆమె అనుమానం పెంచుకున్నారు. ఆయన విధులకు వెళ్లినా వీడియో కాల్ చేసి వేధించేది. ఆమె మానసిక పరిస్థితి సరిగా ఉండేదికాదు. నిత్యం భర్తతో గొడవపడుతూ ఉండేది. కుమారులు అడిగితే వారిపై సైతం గొడవపడేది. ఈ క్రమంలో శనివారం మధ్యాహ్నం విజయ్‌చంద్ర ఇంట్లోనే ఉన్నారు. కుమారులను భోజనం తీసుకురమ్మని బయటకు పంపించారు. ఈక్రమంలో దంపతుల నడుమ మరోమారు గొడవ జరిగింది. ఆగ్రహానికి గురైన భర్త పక్కనే ఉన్న రోకలిబండతో శైలజ తలపై మోదాడు. దీంతో ఆమె అక్కడికక్కడే మృతిచెందింది. డయల్ 112 ద్వారా సమాచారం అందుకున్న నగర ఇన్‌చార్జి డీఎస్పీ ఘట్టమనేని శ్రీనివాసరావు, బాలాజీనగర్ ఇన్‌స్పెక్టర్ కె.సాంబశివరావులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. ఘటనకు దారితీసిన పరిస్థితులను పిల్లలను అడిగి తెలుసుకున్నారు. ఈ మేరకు పెద్దకుమారుడు శ్యామ్ సాత్విక్ ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని జీజీహెచ్ మార్చురీకి తరలించి ఇన్‌స్పెక్టర్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.



మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఇన్‌చార్జి డీఎస్పీ, ఇన్‌స్పెక్టర్

జీవనోపాధి కోసం వెళ్లి..

- గాయపడిన బొగ్గు కూలీ మృతి

మదనపల్లె రూరల్: జీవనోపాధి కోసం నెల్లూరు జిల్లా నుంచి మదనపల్లెకు వలస వచ్చి బైక్ ప్రమాదంలో బొగ్గుకూలీ తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతూ శనివారం మృతిచెందారు. నెల్లూరు జిల్లా కలువాయికి చెందిన ఎం.అంకయ్య(30) భార్య ప్రశాంతి, కుటుంబంతో సహా ఉపాధి నిమిత్తం కలకడ సమీపంలోని మల్లిగుట్టపల్లెకు వచ్చి రెండేళ్లుగా ఉంటున్నారు. స్థానికంగా కలప కాల్చి బొగ్గు తయారీ కూలీగా పని చేస్తున్నారు. 11వ తేదీ బుధవారం కలప కోసేందుకు వినియోగించే యంత్రం మరమ్మతుకు గురికావడంతో రిపేరు చేసుకునేందుకు గుర్రంకొండకు వెళ్లారు. తిరిగి స్వగ్రామానికి వస్తూ వాహనం అదుపు తప్పి మార్గ మధ్యలో రోడ్డుపక్కన ఉన్న బోర్డును ఢీకొని తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు గుర్తించి వెంటనే ఆస్పత్రికి తీసుకెళ్లి చికిత్స చేయడంతో కోలుకుని ఇంటికి వెళ్లారు. అయితే గురువారం ఒంట్లో నలతగా ఉంటే మదనపల్లెకు వచ్చి ప్రైవేట్ ఆస్పత్రిలో పరీక్షలు చేయించుకున్నాడు. ప్రమాదం లేదని చెప్పడంతో తిరిగి ఇంటికి వెళ్లిపోయారు. అయితే లోపలి గాయాలు తిరగబెట్టడంతో శనివారం తీవ్రంగా కడుపునొప్పి రావడంతో కుటుంబసభ్యులు హుటాహుటిన మదనపల్లెలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకొచ్చారు. అక్కడి వైద్యుల సూచన మేరకు సొసైటీ కాలనీలోని మరో ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లారు. అప్పటికే పరిస్థితి విషమించడంతో తిరుపతికి తీసుకెళ్లాలని రెఫర్ చేశారు. ప్రభుత్వ ఆస్పత్రిలో 108 అంబులెన్స్ ఉచితంగా అందుబాటులో ఉంటుందని సూచించడంతో, అంకయ్యను సాయంత్రం అక్కడికి తీసుకొచ్చారు. అత్యవసర విభాగంలో చికిత్స అందించినా అనంతరం పరిస్థితి విషమంగా ఉండటంతో వైద్యులు తిరుపతికి రెఫర్ చేశారు. అంబులెన్స్‌లోకి ఎక్కించేందుకు ప్రయత్నిస్తుండగానే అంకయ్య మృతిచెందాడు. కాగా మృతునికి ముగ్గురు కుమార్తెలు పవిత్ర, కళావతి, గౌతమి ఉన్నారు.



మృతిచెందిన అంకయ్య

వరండాలో నిద్రిస్తుండగా ఇంట్లో చోరీ

- 15 సవర్ల బంగారంతో పాటు రూ.50 వేల నగదు అపహరణ

వింజమూరు(ఉదయగిరి): వింజమూరు మండలం నందిగుంట గ్రామంలో శుక్రవారం అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తులు ఓ ఇంట్లో చోరీకి పాల్పడి 15 సవర్ల బంగారంతో పాటు రూ.50 వేలు నగదును దోచేశారు. స్థానికులు, పోలీసుల కథనం మేరకు.. గ్రామానికి చెందిన ఆమర్లపూడి మాల్యాద్రి- వరలక్ష్మి దంపతులు శుక్రవారం రాత్రి తమ ఇద్దరు పిల్లలతో కలిసి ఇంటి వరండాలో ఆరుబయట నిద్రకు ఉపక్రమించారు. అయితే ఇంటి ప్రధాన తలుపునకు తాళం వేయకుండా గడిపెట్టి వదిలేశారు. ఈ క్రమంలో అర్ధరాత్రి వేళ దొంగలు ఎత్తుగా ఉన్న ప్రహరీ ఎక్కి ఇంట్లోకి ప్రవేశించారు. ప్రధాన ద్వారం గుండా లోపలికి వెళ్లారు. బెడ్‌రూమ్‌లో ఉన్న బీరువాను కట్టర్‌తో కటింగ్ చేసి అందులో ఉన్న 15 సవర్ల బంగారు ఆభరణాలు, రూ.50 వేల నగదును దొంగతనం చేశారు. కాగా అర్ధరాత్రి వేళలో ఇంటిలో శబ్దం వచ్చినట్లు భార్య వరలక్ష్మి భర్తను లేపి చెప్పింది. నిద్రమత్తులో ఉన్న అతను ఫ్యాన్ శబ్దం కావచ్చు అంటూ లేవలేదు. తెల్లవారుజామున 4.30 గంటల సమయంలో మాల్యాద్రి లేచి ఇంట్లోకి వెళ్లి చూడగా బీరువా తెరిచి ఉండడం, వస్తువులు చెల్లాచెదురుగా ఉండడంతో దొంగతనం జరిగినట్లు గుర్తించి పోలీసులకు తెలియజేశారు. పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. క్లూస్ టీమ్ వేలిముద్రలు స్వీకరించింది. కాగా ఆ రాత్రి దొంగలు ముందుగా ఓ రేకుల ఇంట్లో ప్రవేశించి వెతికారు. ఏమీ లభించకపోవడంతో పక్కనే ఉన్న మాల్యాద్రి ఇంట్లో దొంగతనం చేశారు. ఎస్సై వీరప్రతాప్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.



చోరీ జరిగిన ఇంట్లో పరిశీలిస్తున్న ఎస్సై

గతంలో ఓ సారి

కొద్ది రోజులు క్రితం ఇదే గ్రామంలో పట్టపగలు దొంగలు ఓ ఇంట్లో ప్రవేశించి పెద్ద మొత్తంలో బంగారంతో పాటు నగదు అపహరించిన ఘటన మరువక ముందే మరోసారి చోరీ జరగడంతో గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారు.

జిల్లా రెడ్‌క్రాస్ బ్లడ్‌బ్యాంక్‌కు అవార్డులు

నెల్లూరు(అర్బన్): ఇండియన్ రెడ్‌క్రాస్ జిల్లా సొసైటీ బ్లడ్‌బ్యాంక్‌తో పాటు మరో రెండు విభాగాల్లో జిల్లాకు మూడు రాష్ట్రస్థాయి అవార్డులు అందాయి. ప్రపంచ రక్తదాతల దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ అవార్డులను శనివారం గుంటూరులోని భారతీయ విద్యా భవన్‌లో అందజేశారు. 2023–24లో 16,401 యూనిట్లను, 2024–25లకు 15,743 యూనిట్ల రక్తాన్ని సేకరించినందుకు జిల్లా రెడ్‌క్రాస్ వైస్ చైర్మన్ చమర్తి జనార్దన్‌రాజు, బ్లడ్‌బ్యాంక్ కన్వీనర్ చంద్రగిరి అజయ్‌బాబులు అవార్డును అందుకున్నారు. దీనిని రెడ్‌క్రాస్ రాష్ట్ర చైర్మన్ వైడీ రామారావు, జనరల్ సెక్రటరీ అండ్ సీఈఓ ఫరీదా, కోశాధికారి రామచంద్రరాజు ఆధ్వర్యంలో రాష్ట్ర వైద్యశాఖ మంత్రి సత్యకుమార్‌యాదవ్ అందించారు. అలాగే అదానీ కృష్ణపట్నం పోర్టు ఇండస్ట్రీ పీఎస్‌యూ విభాగంలో ఒక్క రోజులో అత్యధిక రక్తసేకరణ జరిపినందుకు, శ్రీసిటీ ప్రైవేట్ లిమిటెడ్ సురేంద్రకుమార్ టీమ్‌కు రెండో స్థానంలో అవార్డు అందజేశారు. అనంతరం రాష్ట్రస్థాయిలోనే 119 సార్లు రక్తదానం చేసిన నెల్లూరు రెడ్‌క్రాస్ బ్లడ్‌బ్యాంక్ మోటివేటర్ మదనపల్లి మధుసూదన్‌రావుకు అవార్డులు వరించాయి.



మంత్రి చేతుల మీదుగా అవార్డును అందుకుంటున్న జిల్లా రెడ్‌క్రాస్ సభ్యులు

పొదలకూరు నిమ్మ ధరలు(కిలో)

పెద్దవి:	రూ.37
సన్నవి:	రూ.25
పండ్లు:	రూ.10

